

# మూరెడు మల్లెలు

గుప్పెడు ప్రేమ, మూరెడు మల్లెలు ఈ రెండే రెండు కోరికలు... ఇంతకన్నా జీవితంలో మరేం అక్కర్లేదన్న భార్య అతి సామాన్యమైన కోరికలు... గుప్పెడు ప్రేమకయితే కొదవలేదు. కాని మూరెడు మల్లెలు కావాలన్న కోరిక మాత్రం తీరకుండానే ఆమె తనువు చాలించడం భరించలేని విషాదం. భార్యకు మూరెడు మల్లెలు కొనివ్వలేని పరిస్థితులు చివరాఖరుకు అతణ్ణి కుమిలిపోయేలా చేస్తాయి. ఈ చేదు వాస్తవాల్ని బలంగా రూపు కట్టించిన కథ ఇది.





విజయార్కె

ఏడుస్తున్నాడు హర్షవర్ధనరావు.

నగరంలో మల్టీ మిలియనీర్. బిజినెస్ టైకూన్‌గా హర్షవర్ధనరావు తన హోదాను, అంతస్తును అన్నింటినీ మరిచి ఏడుస్తున్నాడు.

ఆయన భార్య వసుమతి పార్థివదేహం ఐస్‌క్యూబ్స్ మీద సేద తీరుతోంది. ముప్పయ్యేళ్ళు తనతో కాపురం చేసి, తన కష్టాలను ఇష్టాలుగా మార్చుకొని, భర్తే ప్రపంచంగా బ్రతికి, ఇప్పుడు ప్రశాంతంగా శాశ్వత నిద్రపోతోంది. భార్య చివరి నిద్రను చూసి విలపిస్తున్నాడు.

అతని జ్ఞాపకాల పేటిక తెరుచుకుంది. ఎన్ని అనుభవాలు... ఎన్ని అనుభూతులు... ఎన్ని మజిలీలు... మరెన్ని మలుపులు? కష్టాలు, కన్నీళ్ళూ... అన్నీ... జ్ఞాపకాల పేటికలో నుంచి వెలుపలికి వచ్చి, అతడి ముందు నిలిచాయి.

పేదరికం తాలూకు గతం, సమస్యల తాలూకు నేపథ్యం ఏదీ అతను మరిచిపోలేదు. చివరికి తన భార్య కోరిక... ముప్పయ్యేళ్ళు తనతోపాటు పెంచుకున్న కోరిక... ఆ కోరికను తను తీర్చలేదన్న విషయం కూడా మరిచిపోలేదు.

బంధుమిత్రులు వస్తున్నారు. స్నేహితులు ఓదారుస్తున్నారు. బిజినెస్ పీపుల్స్ సానుభూతి చూపిస్తున్నారు. స్టేట్స్‌లో వున్న కొడుకు, ఢిల్లీలో వున్న కూతురు బయల్దేరుతున్నామని ఫోన్ చేశారు.

అర్ధరాత్రి కూడా జనంతో నిండిపోయింది ఇల్లు. హర్షవర్ధనరావు పలుకుబడి అలాంటిది. ఇవేమీ అతనికి ఓదార్పును కలిగించడంలేవు. మరణం ఇంత భయంకరంగా వుంటుందని ఒకరు లేనిచోటు ఇంత విషాదంగా వుంటుందని అతనికి అర్థమై, మనసు ఆర్ద్రమై, విషాదం వర్షించడానికి సిద్ధమైన మేఘమైంది.

తను కోల్పోయిందేమిటో తెలిసింది. కానీ అప్పటికే ఆలస్యమైంది. చేజారిన గతాన్ని వర్తమానంగా మార్చుకోలేడు. చిత్రంగా అతనికి ఏడుపు రావడంలేదు. ఏడ్చినా కన్నీళ్ళు రావడంలేదు. కన్నీళ్ళొచ్చి తన గుండె బరువు దిగితే బావుండుననుకుంటున్నాడు.

విషాదం పెరిగే కొద్దీ, గుండె బరువూ పెరిగి శరీరం ఆ బరువు మోయలేనంతగా తయారవుతోంది.

"ఏవీ... ఏవీ తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహముల్..." అన్నట్టు అతని మనసు నిన్నటి జ్ఞాపకాలను, జ్ఞాపకాల పేటికలో నుంచి వెతుక్కునే ప్రయత్నం చేస్తోంది.

ఆ ప్రయత్నంలో...

** ** **

హర్షవర్ధనరావుకు పెళ్ళయింది.

డిగ్రీ చేతిలో వున్నా, నోటికి రెండు ముద్దలు అందించలేని నిరుద్యోగి హర్షవర్ధనరావుకు పెళ్ళయింది. "అబ్బాయి బాగా చదువుకున్నాడు. బుద్ధిమంతుడు. కానీ ఉద్యోగం లేదు" అని వసుమతి తల్లిదండ్రులు ఆలోచించినప్పుడు... సిగ్గుతెరలను దించి స్పష్టంగా చెప్పింది వసుమతి.

"అమ్మా... నాన్నా... కేవలం ఉద్యోగం లేకపోవడమొక్కటే అతని అనర్హత కాదు. చాలామందికి ఉద్యోగం వుండి, డబ్బు వుండి, మంచి మనసు ఉండదు కదా..."

కూతురి మనసు అవగతమైంది. వెంటనే సింపుల్‌గా పెళ్ళి జరిపించారు వసుమతి తల్లిదండ్రులు.

** ** **

మొదటిరాత్రి....

నేలమీద చాప పరుచుకుని, ఓ దిండును ఇద్దరూ షేర్ చేసుకొని, ఓ పక్క దోమలతో కుస్తీ పడుతూ కనీసం ఫ్యాన్ కూడాలేని స్థితిలో, పాలగ్లాసు బదులు మంచినీళ్ళ గ్లాసుతో ఆ గదిలోకి వచ్చింది వసుమతి.

నిజం చెప్పాలంటే వున్నది ఒకేఒక గది.

ఇంత పెద్ద నగరంలో భర్తతోపాటు కాపురానికి వచ్చింది వసుమతి. తల్లిదండ్రులు తమకున్నదాంట్లో కొంత కూతురికి ఇవ్వబోయినా వద్దని వారించి... 'తన భర్తకు వున్నదాంట్లోనే తాము బ్రతుకుతామని" చెప్పింది. ఆమె ఆత్మాభిమానం చూసి అతనికి ముచ్చటేసింది.

అది అతనికి సంతోషాన్నే కలిగించింది. ఎంతమందికి అలాంటి అదృష్టం కలుగుతుంది.

దోమల నేపథ్య సంగీతం మధ్య, నెలకొచ్చే జీతం, దాని బట్వాడాకు సంబంధించిన చర్చల మధ్య వాళ్ళ మొదటిరాత్రి జరిగింది.

వసుమతి సిగ్గుకన్నా, అణుకువే బాగా నచ్చింది హర్షవర్ధనరావుకు.

కొత్తగా పెళ్ళయిందన్న ఆనందాన్ని అతనికి ఎలా సెలబ్రేట్ చేసుకోవాలే అర్థం కాలేదు. దానికి కారణం ఆర్థికలేమే. అయినా వసుమతి బాధపడలేదు.

రోజులు గడిచేకొద్దీ ప్రేమలో నిత్య నూతనత్వం వెల్లివిరియాలని ఆమె కోరిక.

మొదటిరాత్రి హర్షవర్ధనరావు భార్యను తన కౌగిలిలోకి తీసుకొని...

"వసూ... నీకేం కావాలో చెప్పు... బహుశ అది ఇప్పుడు తీర్చలేకపోయినా... నా జీవితంలో ఏదో ఓరోజు ఖచ్చితంగా తీరుస్తా..." అన్నాడు మనస్ఫూర్తిగా.

నవ్వింది వసుమతి.

ఆమె జడలో మల్లెపూలు లేకపోయినా అవి ఆమె పెదవుల మీద వున్న అనుభూతి కలిగింది హర్షవర్ధనరావుకి. ఆమె నవ్వు మల్లెలంత స్వచ్ఛంగా వుంది.

'చెప్పు వసుమతి... నీకే కోరికా లేదా?

'ఉంది' అంది బిడియపడుతూ.

"చెప్పు..." ఆమె చుబుకాన్ని పైకెత్తి అడిగాడు.

"రెండే రెండు కోరికలు..." అంది.

"ఆరోజు కైకేయ దశరథుడిని మూడు కోరికలు కోరింది. నువ్వోటి తక్కువ కోరావు" నవ్వుతూ అన్నాడు.

"కానీ, ఆ కోరికలు తన పసుపు కుంకుమలను దూరం చేస్తాయని కైక ఊహించలేదు. నేను కోరే రెండు కోరికలు నా పసుపు కుంకుమలను దూరం చేసేవి కావు. నేను మీకు దూరమయ్యేలోగా అవి నాకు దగ్గరవ్వాలని...

"వసూ.... ఆర్తిగా దగ్గరకు తీసుకొని... చెప్పు ఏమిటా రెండు కోరికలు" అడిగాడు.

"ఒకటి గుప్పెడు ప్రేమ... మీ మనసులో నా మీద గుప్పెడు ప్రేమ వుండాలి. అది నేను చచ్చేవరకూ..." అలా అంటున్నప్పుడు ఆమె కంఠం వణికింది.

ఆమె పెదవులను తన చేత్తో మూసి "ఛ..ఛ.. అవేం మాటలు. నీ మీద నాకెప్పుడూ ప్రేమ చావదు" అన్నాడు సిన్సియర్‌గా.

"థాంక్యూ..." ఆమె పెదాలు వణికాయి.

"మరి రెండోది?"

"మూరెడు మల్లెలు..."

అతను విస్మయంగా చూసాడు.

"అవునండీ... గుప్పెడు ప్రేమ, మూరెడు మల్లెలు... ఒకటి మానసికమైన మీ ప్రేమకు గుర్తు. రెండవది నేనెప్పుడూ సుమంగళినేనని అనడానికి గుర్తు. ఊహ తెలిసినప్పట్నుంచి నా కోరికలు ఇవే. మీ ప్రేమ తరగకూడదు. నా కోసం మీరు తెచ్చే మూరెడు మల్లెలు... నాకు బోల్డు భోగభాగ్యాలతో సమానం..."

అతను విస్మయంతో స్థాణువయ్యాడు.

విభ్రమంతో కంట తడిపెట్టాడు.

** ** **

తెల్లవారి బడ్జెట్ వేశాడు.

తనకొచ్చే నూటయాభై రూపాయల జీతంలో ఇంటి అద్దె పాతిక, పాలకి పదిహేను, కరెంటు బిల్లు, కాఫీపొడి ఖర్చు, వెచ్చాలు... లెక్కవేస్తే అతికష్టంగా నూటయాభైకి చేరుకుంది.

అతని మనసు చివుక్కుమంది.

తనకు సిగరెట్, పాన్, వక్కపొడి అలవాట్లు కూడాలేవు.

రోజూ వసుమతికి మూరెడు మల్లెపూలు తేవాలని అతని కోరిక. రోజూ పావలా చొప్పున ఏడున్నర... కానీ... ఎక్కడ?

వసుమతి అంది.

"దానికోసం ఎందుకండీ అంత బాధ. గుప్పెడు ప్రేమ ఎలాగూ నావెంటే వుంటుంది. మూరెడు మల్లెలు ఎప్పుడో మీరు తీసుకురాకపోతారా?" అని ఓదార్చింది.

** ** **

సంవత్సరం గడిచింది. ఈ సంవత్సరంలో ఎప్పుడూ అతని కోరిక తీరలేదు. ఓనెల ఓవర్‌టైమ్ చేసాడు. అయిదు రూపాయలు వచ్చింది. మూరెడు మల్లెలు భార్యకోసం తీసుకువెళ్ళొచ్చని సంతోషపడ్డాడు. సరిగ్గా అప్పుడే వసుమతికి జ్వరం వచ్చింది. మందులకు ఖర్చయిపోయింది.

** ** **

రెండవ సంవత్సరం అతని జీతం పాతిక పెరిగింది.

అతని సంతోషానికి అవధుల్లేక... "తనిక నుంచి వసుమతికి రోజూ మూరెడు మల్లెపూలు తీసుకురావచ్చు" అనుకున్నాడు. అప్పుడే ఓ శుభవార్త వచ్చి అతని కోరికకు ఆశనిపాతంలా తగిలింది. సంతోషపడాలో, బాధపడాలో అర్థంకాలేదు.

వసుమతి గర్భవతి... నెలతప్పి, తన జ్ఞాపకాన్ని కడుపులో పదిల పర్చుకున్న భార్యను చూసి సంతోషపడాలో, తనిక మూరెడు మల్లెలు తెచ్చే అవకాశం లేదని బాధపడాలో అర్థంకాలేదు.

ప్రతీనెలా డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళాలి. పైగా కాన్పుకోసం కొంత డబ్బు నెలనెలా అట్టిపెట్టాలి. అలా తనకు పెరిగిన జీతం డబ్బు, అతని కోరికను నిరాశపరిచింది.

** ** **

పండంటి మగబిడ్డని ప్రసవించింది. బిడ్డ పుట్టిన వేళావిశేషం... అతనికి వంద రూపాయలు జీతం ఒకేసారి పెరిగింది. దానికితోడు బిడ్డ ఖర్చులు కూడా పెరిగాయి. పెరిగిన జీతం అలా అతణ్ణి నిరాశపరిచింది... మరోసారి!

** ** **

మూడో సంవత్సరం అతని జీతం నాలుగువందలైంది.

వసుమతి మళ్ళీ నెల తప్పింది.

మళ్ళీ ప్రసవం, బారసాల... ఖర్చులు... నాలుగేళ్ళు గడిచి జీతం ఆరువందలకు చేరుకుంది.

** ** **

ప్పు... కొడుకుని స్కూల్లో జాయిన్ చేసాడు. నెలనెలా ఫీజులు, బట్టలు,

**వసుమతి గర్భవతి... నెలతప్పి, తన జ్ఞాపకాన్ని కడుపులో పదిల పర్చు కున్న భార్యను చూసి సంతోషపడాలో, తనిక మూరెడు మల్లెలు తెచ్చే అవకాశం లేదని బాధపడాలో అర్థంకాలేదు.**

పుస్తకాలు అతని మూరెడు మల్లెపూల కోరిక అలా వాడిపోతూనే వుంది అతని స్మృతి పథంలో.

** ** **

అలా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం అతని కోరిక, వసుమతి జీవితకాలపు కోరిక వాయిదా పడుతూనే వుంది. "ఎంత చెట్టుకు అంతగాలి" అన్నట్టు పెరిగే జీతం, పెరిగే ఖర్చులకు సరిపోతోంది.

** ** **

పదిహేనేళ్ళు గడిచింది.

హర్షవర్ధనరావు జీతం అయిదువేలు దాటింది. కానీ పిల్లలను కాలేజీలో చేర్పించాడు. డొనేషన్లు... బుక్స్... కాలేజీకి వెళ్ళడానికి సైకిల్, అమ్మాయికి మోపెడ్.

** ** **

పిల్లల డిగ్రీ అయిపోయింది.

హర్షవర్ధనరావు చిన్న వ్యాపారం ప్రారంభించాడు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నందుకు వచ్చిన డబ్బే పెట్టుబడి అతని వ్యాపారానికి. వసుమతి అతనికి చేయూతనిచ్చింది. పగలూ, రాత్రీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేశాడు. వ్యాపారం డెవలప్ అయింది. ఏ అర్థరాత్రో ఇంటికి వచ్చేవాడు.

** ** **

మరో అయిదేళ్ళు గడిచాయి.

కొడుకుని స్టేట్స్‌కు పంపాడు. కూతుర్ని ఓ పెద్ద బిజినెస్ మాగ్నేట్ కొడుకుకు ఇచ్చి పెళ్ళిచేశాడు.

హర్షవర్ధనరావు ఇప్పుడు నెంబర్‌వన్ బిజినెస్ మాన్. వ్యాపార ప్రపంచంలో అతనికి తిరుగులేదు. రోజులో నిద్రపోయే ఏ నాలుగైదు గంటలో మినహాయిస్తే... ఎప్పుడూ విమానాల్లో దేశాలు తిరుగుతూ ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ బిజినెస్ వ్యవహారాలు పర్యవేక్షిస్తూ...

అయితే ఈ బిజీలో వసుమతి చిన్న కోరికను మరిచిపోయాడు. ఏ అర్థరాత్రో ఇంటికి వస్తాడు. అలసిపోయి వచ్చిన భర్తను చూసి వేడివేడి భోజనం వండిపెట్టి అతన్ని సేదతీరుస్తుంది. అతను నిద్రపోయేవరకూ అతని కాళ్ళు నొక్కుతూ... వుండిపోతుంది.

అలసటలో అతను వసుమతితో మాట్లాడలేకపోతాడు. ఏ పగలో స్టేట్స్‌లో బయల్దేరి, ఏ అర్థరాత్రో ఇండియా చేరే హర్షవర్ధనరావు భార్యకోసం నెక్లెస్‌లు, విలువైన ఆర్టికల్స్ తెస్తాడు. అంతకన్నా విలువైన మూరెడు మల్లెలు మరిచిపోతాడు.

నోరెత్తి అడగదు వసుమతి.

అలాంటి వసుమతి... ఓ అర్థరాత్రి గుండెపోటు వచ్చి, అంత పెద్దింట్లో ఎవరూ పలికేవారు లేక... డాక్టర్ దగ్గరికి కూడా తీసుకువెళ్ళే టైంలేకుండానే కన్నుమూసింది.

** ** **

అతని జ్ఞాపకాల పేటిక మూసుకుంది. కన్రెప్పలు మధ్య ఉబికి పైకొచ్చిన కన్నీళ్ళు బాధతో నేలపైకి రాలి ఆత్మార్పణ చేసుకున్నాయి. చిన్న కోరిక... సజీవమైన కోరిక... ప్రాణప్రదమైన కోరిక... "ఏవండీ గుప్పెడు ప్రేమ... మూరెడు మల్లెలు చాలండీ..."అన్న తన భార్య కోరిక అతని గుండెలో ప్రతిధ్వనిస్తూనే వుంది.

** ** **

కొన్ని గంటల వ్యవధిలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి లారీల్లో మల్లెలు వచ్చి చేరాయి. విదేశాల నుంచి పుష్పాలు విమానాల్లో దిగాయి... నిలువెత్తు మల్లెల మీద తన భార్య పార్థివ దేహాన్ని పడుకోబెట్టాడు హర్షవర్ధనరావు.

"వసూ... మన్నించుమా... బ్రతికి వున్నప్పుడు తీర్చలేని నీ కోరిక... ఇప్పుడిలా..." దోసిళ్ళతో మల్లెపూలను ఆమె భౌతికకాయంపై జల్లుతూ అనుకున్నాడు. చెదరని ప్రశాంతచిత్తంతో నిదురపోతున్న దానిలా ఉన్న ఆమె మోమును చూసి స్థాణువులా నిలబడిపోయాడు. ఆమె జీవితకాలంలో ఓ చిన్న కోరికను తీర్చలేకపోయినందుకు తనను తను నిందించుకుంటూ తలవంచుకు నిలబడిపోయాడు. ●

# సమస్య-పరిష్కారం

**ఆఫీసుకు సంబంధించిన డ్రాఫ్టింగ్ నేర్చుకోవాలంటే ఏమైనా పుస్తకాలున్నాయా ? తెలుపండి**

**-సి.శ్రీనివాసులు , కదిరి, అనంతపురం**

శ్రీనివాసులు గారు ! డ్రాఫ్టింగ్ నేర్చుకోవాలంటే బోల్డన్ని పుస్తకాలున్నాయండి. ఇవి ఎక్కువగా ఇంగ్లీష్‌లోనే ఉన్నాయి.అందువల్ల మీరు పేరొందిన బుక్‌షాపులకు వెళ్ళి అడిగితేనే దొరుకుతాయి.

** ** **

**నాపేరు కావ్య. నేను ఇంటర్ రాసాను కానీ పాసవలేదు. మళ్ళీసెప్టెంబర్‌లో కట్టినా రాలేదు. ఇంజనీరింగ్‌కు వెళ్ళాలని కోరిక కానీ... ఏంచేయమంటారు?**

**- కావ్య, రాజమండ్రి**

మొదట ఇంటర్ పాసవడానికి ట్రై చేయండి. బాగా మనసుపెట్టి చదివితే మీరు ఖచ్చితంగా పాసవుతారు. పరీక్షల మీద బెంగపెట్టుకోవాల్సిన అవసరం లేదు. విష్ యూ బెస్ట్‌ఆఫ్‌లక్.

**నాపేరు రాజేంద్ర, నేను ఇంటర్ బైపిసితో పాసయ్యాను. తర్వాత మైక్రోబయాలజీ గానీ ,డిఫార్మసీ కానీ చేద్దామని అనుకుంటున్నాను.ఈ రెంటిలో ఏది బాగుంటుంది?**

**-రాజేంద్ర, ఒంగోలు.**

రాజేంద్రగారు! మీరడిగిన మైక్రోబయాలజీ , డిఫార్మసీ కోర్సులు రెండూ మంచివే. ఇకపోతే మీకు ఏది ఇష్టమో అది తేల్చుకోండి. రెండింటిలో నూ మంచిఅ వకాశాలున్నాయి.

**నాపేరు ఎన్.కిషోర్ , మాది కారంజేడు. ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చాయి. కానీ మాది మధ్యతరగతి కుటుంబం. ఏవియేషన్ కోర్సు చేయాలని ఉంది. ఏంచేయమంటారు?**

**- ఎన్.కిషోర్, కారంజేడు.**

ఏవియేషన్ కోర్సులకు ఫస్ట్ క్లాస్ ఉండాలి. ఇకపోతే మీరు మార్కుల గురించి రాయలేదు. మధ్యతరగతి కుటుంబం అంటున్నారు కానీ ఏవియేషన్ కోర్సు చాలా ఖరీదైన కోర్సు. మీకు అందుబాటులో ఉన్న చదువుగురించి మొదట ఆలోచించి తర్వాత ఏవియేషన్ కోర్సు గురించి ఆలోచించండి.

**నాపేరు అంజలి. నేను డిగ్రీ చదువుతున్నాను. నాకు పాప్ ఆల్బమ్‌లో ఆక్ట్ చేయాలని ఉంది.ఏం చేయమంటారు ?**

**-అంజలి, హిందూపూర్**

- మీ కోరిక మంచిదే . కానీ అలా ఎవరూ అవకాశమివ్వరు. మీ ఫోటోస్‌తో పాటు మీవివరాలను ఈ క్రింది చిరునామాకు పంపిస్తే వారివల్ల మీకు అవకాశాలు రావచ్చు. లిటిల్‌రేన్ ప్రొడక్షన్స్, 2-2-647/3, న్యూనల్లకుంట, హైదరాబాద్ -44

నిర్వహణ : దండంరాజు లక్ష్మీసుమన్

తెల్లమచ్చలు

ప్రయోగించిన 36 గంటలలోపు మచ్చ యొక్క రంగు మారి నెమ్మదిగా శరీరం రంగులో కలిసి పోవును. 7 రోజుల మందు ఉచితం. తప్పక ప్రయోగించి చూడండి. వయసు, మచ్చ వివరాలు తప్పక వ్రాయండి.

**GAYA AYURVED BHAVAN (V)**

P.O. KATRI SARAI (GAYA) 805 105